క్లుప్తంగా

సుంకేసులకు 1,760 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు 1,760 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో ఉంది. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాంలో 1.068 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

కర్నూలు(టౌన్):నగర శివారులోని పెద్దపాడు లో ఉన్న ఏపీ మోడల్ స్కూలులో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం తైక్వాండో సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభమైంది. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ హాజరై క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ కోచింగ్ క్యాంపును విద్యార్థు లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తైక్వాండో క్రీడ సాధన వల్ల పిల్లల్లో మానసిక వికాసం, ఆత్మవిశ్వాసం అలవడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ జి.షబ్బీర్ హుస్సేన్, ఏపీ మోడల్ స్కూల్ పీఈటీ నాగమణి పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ



విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో విత్తన, పురుగు, ఎరువు మందుల దుకాణాలను ఏఓ మల్లేష్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. నిషేధిత మందులు, విత్తనాలు విక్రయించినట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల వద్ద ధరలు, నిల్వల బోర్డులు ప్రదర్శించాలని, రికార్డులు పక్కాగా ఉండేలా చూసుకోవాలని, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మాత్రమే విక్రయిచి రైతులకు రసీదులు ఇవ్వాలని సూచించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గడివేముల: ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి తరగతిలో ప్రవేశానికి ఈ నెల 25వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కరపత్రాల విడుదల

పాణ్యం: గ్రామాలకు పోదాం కార్యక్రమం కరపత్రాలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల సామేల్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కోసం కొన్నేళ్లుగా పోరాడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. త్వరలో జరగబోయే డోన్ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, తిమ్మయ్య పాల్గొన్నారు.

వారంలోగా నిర్మాణాలు ప్రారంభించాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ

కోడుమూరు: జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరైన వారంతా వారం రోజుల్లోగా ఇంటి నిర్మాణాలను మొదలుపెట్టాలని తహసీల్దార్ శేషఫణి సూచించారు. శనివారం ప్యాలకుర్తి జగనన్న కాలనీని తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీఓ చంద్రశేఖర్ హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇంటి స్థలం, ఇల్లు మంజూరు చేసి ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టలేదని, వారం రోజుల్లో ప్రారంభించకపోతే రద్దు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పుట్టినరోజును పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నేతలు శనివారం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ యాదవ్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షాకీర్‌బాషా, నేతలు లాయర్ ప్రభాకర్, బలరాం, కౌలుట్ల, గోవర్ధన్, గోవిందు పాల్గొన్నారు.

‘పది’లో ప్రభుత్వ విద్యార్థుల సత్తా

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. శనివారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా జిల్లా పరిషత్, ఆదర్శ, గురుకుల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు మెరుగైన ఫలితాలు సాధించాయి. వీటిలో చదివే పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు అత్యధిక మార్కులు సాధించి ఔరా అనిపించారు.



93.51 శాతం ఉత్తీర్ణత సాధించిన నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ గురుకుల బాలికల పాఠశాల

కోడుమూరు రూరల్: పదో తరగతి ఫలితాల్లో మండలం 58.99 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ అనంతయ్య తెలిపారు. 1,051 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 620 మంది పాసయ్యారన్నారు. కాగా మండలంలోని గోరంట్ల ఎంజేపీఏపీ డబ్ల్యూ బాలుర పాఠశాల 98.70 శాతం ఫలితాలు సాధించింది. 77 మంది విద్యార్థుల్లో 76 మంది పాసయ్యారు.

గూడూరు రూరల్: మండలంలోని జూలకల్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు 98 మంది పరీక్ష రాయగా 43 మంది ఉత్తీర్ణత సాధించారు. పెంచికలపాడు హైస్కూల్‌లో 27 మంది విద్యార్థులకు గానూ 15 మంది, చనుగొండ్ల హైస్కూల్‌లో 50 మందికి గానూ 18, మునగాల హైస్కూల్‌లో 14 మందికి గానూ 5, గుడిపాడు హైస్కూల్‌లో 14 మందికి గానూ ఐదుగురు పాసయ్యారు.

తగ్గిన ఉత్తీర్ణత శాతం

ఓర్వకల్లు: పదో తరగతి ఫలితాల్లో మండలంలో ఉత్తీర్ణత శాతం తగ్గింది. మొత్తం 763 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 371 మంది (48 శాతం) పాసయ్యారు. కాల్వబుగ్గ గురుకుల పాఠశాలలో 83 మందికి 83 మంది పాసై వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇద్దరు విద్యార్థులు భానుప్రకాష్, లాల్ మహ్మద్ 580 మార్కులు సాధించగా, వీరేష్‌నాయక్ 578 మార్కులతో పాసయ్యాడు. కస్తూర్బా విద్యాలయం 66 శాతం, సోమయాజులపల్లె జెడ్పీ హైస్కూల్ 60 శాతం, ఏపీ మోడల్ స్కూల్, 58 శాతం, పూడిచెర్ల జెడ్పీ హైస్కూల్ 10 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఉయ్యాలవాడ జెడ్పీ హైస్కూల్ 45 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ పాఠశాల విద్యార్థిని హర్సిత 522 మార్కులు సాధించింది. లొద్దిపల్లె ప్రభుత్వ పాఠశాల 45 శాతం ఫలితాలు నమోదయ్యాయి.

● కల్లూరు: పదో తరగతి ఫలితాల్లో మండల వ్యాప్తంగా 45 శాతం మంది విద్యార్థులు ఉతీర్ణులైనట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. మొత్తం 1,238 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 561 మంది పాసయ్యారన్నారు.

పెరిగిన ఉత్తీర్ణత శాతం

సి.బెళగల్: మండలంలో పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరిగింది. గత ఏడాది 33.08 శాతం నమోదు కాగా ఏడాది 50 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. మండల వ్యాప్తంగా మొత్తం 738 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 370 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 13 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 64 మంది విద్యార్థులకు గానూ 51 మంది పాస్‌తో 80 శాతం ఉత్తీర్ణ నమోదైంది. పోలకల్ జెడ్పీ హైస్కూల్‌లో 89 మంది విద్యార్థులకు గానూ 29 మంది మాత్రమే పాస్‌కావడంతో 32.5 శాతం ఫలితాలు నమోదయ్యాయి. అలాగే జెడ్పీ స్కూల్‌లో 112 మందికి గానూ 56 మంది (50%), కొత్తకోట జెడ్పీ పాఠశాలలో 126 మంది విద్యార్థులకు గానూ 51 మంది పాస్‌తో 40%, ముడుమాల జెడ్పీ పాఠశాలలో 66 మంది విద్యార్థులకు గానూ 28 మంది పాస్‌తో 42%, పోలకల్ జెడ్పీ పాఠశాలలో 89 మంది విద్యార్థులకు గానూ 29 మంది పాస్‌తో 32.5%, మారందొడ్డి జెడ్పీ పాఠశాలలో 24 మందికి గానూ 11 మంది పాస్‌తో 46%, కంబదహాల్ జెడ్పీ పాఠశాలలో 41 మందికి గానూ 19 మంది పాస్‌తో 46%, బురాన్‌దొడ్డి జెడ్పీ పాఠశాలలో 43 మందికి గానూ 22 మంది పాస్‌తో 51%, సంగాల జెడ్పీ పాఠశాలలో 33 మందికి గానూ 19 మంది పాస్‌తో 57.5%, ఇనగండ్ల జెడ్పీ పాఠశాలలో 23 మందికి గానూ 11 పాస్‌తో 47%, గురుకుల పాఠశాలలో 64మందికి గానూ 51 మంది పాస్‌తో 80%, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 42 మందికి గానూ 27 పాస్‌తో 64%, ఏపీ మోడల్‌లో 75 మందికి గానూ 46 మంది పాస్‌తో 61.33% ఫలితాలు నమోదయ్యాయి.

పాణ్యం మండలంలో 54.40 శాతం..

పాణ్యం: పదో తరగతి ఫలితాల్లో మండలం 54.40 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ కోటయ్య తెలిపారు. మొత్తం 511 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 278 మంది ఉత్తీర్ణత సాధించారు. నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ రెసిడెన్సియల్ బాలికల పాఠశాలలో 77 మంది బాలికలు పరీక్షలు రాయగా 72 మంది, ఆశ్రమ బాలికల పాఠశాలలో 37 మందికి గానూ 30 మంది, గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 29 మంది విద్యార్థులకు గానూ 21 మంది, సుగాలిమెట్ట వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 38 మందికి గానూ 23, ఏపీ మోడల్ స్కూల్‌లో 87 మందికి గానూ 57 మంది, గోరుకల్లు ప్రభుత్వ పాఠశాలలో 16 మందికి గానూ 9 మంది, కొండజుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9 మందికి గానూ నలుగురు, మద్దూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 29 మందికి గానూ 13 మంది, నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో 14 మందికి గాను ఐదుగురు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 100 మందికి గానూ 31 మంది, బలపనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 49 మందికి గాననూ 17 మంది, కొణిదేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 15 మందికి గానూ ఇద్దరు పాసయ్యారు. కాగా తమ్మరాజుపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 11 మంది పరీక్షలు రాయగా అందరూ ఫెయిల్ అయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం జయచంద్రారెడ్డి చెప్పారు.

గడివేముల మండలంలో..

గడివేముల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మొత్తం 387 మంది పరీక్షలు రాయగా 184 మంది ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి రామకృష్ణుడు తెలిపారు.

గృహ నిర్మాణాలపై అవగాహన పెంచాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

● కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన

గూడూరు రూరల్: గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి నిర్మాణాలు చేపట్టేలా చూడాలని అధికారులకు కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన ఆదేశించారు. కె.నాగలాపురంలోని జగనన్న కాలనీలో శనివారం ఆమె పర్యటించి గృహ నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ ఏఈ జమ్మన్న, ఎంపీడీఓ మాధవీలతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అప్పటికీ కూడా పనులు మొదలుపెట్టకపోతే ఇంటి పట్టాను రద్దు చేస్తామన్నారు. అనంతరం సచివాలయం తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. ప్రతి ఉద్యోగి సమయ పాలన పాటించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. ప్రతి రోజు స్పందన నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అర్జీలకు పరిష్కారం చూపాలని ఆమె సూచించారు.

● సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో హౌసింగ్ ఏఈ సుమంత్ పర్యటించి, జగనన్న కాలనీలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. 27 ఇళ్లు మంజూరు కాగా నాలుగు పూర్తయ్యాయని, 11 ప్రారంభదశలో, 12 బేస్‌మట్టం లెవల్‌లో ఉన్నాయని వర్క్‌ఇన్‌స్పెక్టర్ రంగన్న ఏఈకి వివరించారు.

పెద్దనేలటూరు వృషభాల ప్రతిభ

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ ఈరన్న స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించిన పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీల్లో పెద్దనేలటూరు వృషభాలు విజేతగా నిలిచాయి. వివిధ జిల్లాలకు చెందిన 6 జతల వృషభాలు పోటీ పడగా గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు సుంకన్న, సీతారాముడు వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి. అనంతపురం జిల్లా రంగారెడ్డి యాదవ్ ఎడ్లు రెండవ, నంద్యాల జిల్లా పోదొడ్డి వృషభాలు మూడవ, కృష్ణగిరి మండలం సంగాల సలీమ్ వృషభాలు నాలుగవ స్థానంలో నిలిచి వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేల నగదు బహుమతులను కైవసం చేసుకున్నాయి.



బండను లాడుతున్న వృషభాలు

రాజన్న రాజ్యం జగనన్నతోనే సాధ్యం

● కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



స్థానికులతో మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): రాజన్న రాజ్యం జగనన్నతోనే సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం 39వ వార్డు సోనియా గాంధీనగర్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు వెంటనే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధితో పాటు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నను నిండుమనసుతో దీవించాలని కోరారు. మాసాహెబా మసీదు వద్ద రోడ్లు, మురుగునీటి కాల్వలను ఎమ్మెల్యే మంజూరు చేయడంతో మసీదు ముతవల్లీ బారిసాహెబ్, మన్సూర్, యాసీన్‌లు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టిన రోజు కావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పూలమాలలు, బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాంబ, గిప్సన్, వైస్ ఎంపీపీ–2 నెహేమ్యా, సచివాలయ కన్వీనర్లు నారాయణ, భాస్కర్, కరీముల్లా, మోహన్‌బాబు, మున్సిపల్ డీఈ షాకీర్‌బాషా, ఎస్‌ఐ రామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచండి

గడివేముల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఈఓపీఆర్‌డీ అబ్దుల్‌ఖాలిక్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని చిందుకూరు గ్రామంలో పర్యటించారు. చెత్త సేకరణ కేంద్రాన్ని, ఓహెచ్‌ఆర్ ట్యాంకులను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఈఓపీఆర్‌డీ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలకు చేరే విధంగా అధికారులు పనిచేయాలన్నారు. అనంతరం సచివాలయంలో ఆధార్‌నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంపట పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న వృషభాలు

ఓర్వకల్లు: శ్రీదేవి, భూదేవి సహిత చెన్నకేశవస్వామి తిరునాల సందర్భంగా గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండలాగుడు పోటీలను శనివారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రారంభించారు. 12 ఎడ్ల జతలు పాల్గొనగా అందులో పాణ్యం మండలం ఎస్ కొత్తూరు బీరం బుల్స్ మొదటి స్థానంలో నిలిచి రూ.40 వేలను కైవసం చేసుకున్నాయి. అదే గ్రామానికి చెందిన బీరం బుల్స్(చిన్న జత) రెండవ స్థానంలో నిలిచి రూ.30 వేలు, గద్వాల జిల్లా, గొర్లగాన్‌దొడ్డి గ్రామానికి చెందిన కుర్వ కర్రెప్ప వృషభాలు మూడవ స్థానంలో నిలిచి రూ.25 వేలు, ఓర్వకల్లు మండలం మంగళంపల్లె మురళిమోహన్ వృషభాలు నాల్గో స్థానంలో నిలిచి రూ.15 వేలు, బండి ఆత్మకూరు మండలం కాకనూరు గ్రామానికి చెందిన నార్ల శివారెడ్డి వృషభాలు ఐదో స్థానంలో నిలిచి రూ.10 వేలు, శిరువెళ్ల మండలం బోయలకుంట్ల గ్రామానికి చెందిన షేర్ గిత్తల సుబాన్ వృషభాలు ఆరో స్థానంలో నిలిచి రూ.5 వేల నగదు బహుమతులు గెలుచుకున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాసుదేవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జెల్లి కృష్ణ, చేట్ల క్రిష్టఫర్ పాల్గొన్నారు.

పేదలకు అండగా నవరత్నాలు

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు/ఓర్వకల్లు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు పేదలకు అండగా నిలుస్తున్నాయని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం కల్లూరు మండలం తడకనపల్లె, ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వారం రోజుల నుంచి తాగునీటి కొరత ఏర్పడిందని, మురుగు కాల్వలు సరిగా లేక మురుగు నీరు బయటకు పోవడంలేదని లొద్దిపల్లె ఎస్సీ కాలనీ వాసులు ఫిర్యాదు చేయగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్న పాలనలోనే పేదలకు సముచిత న్యాయం జరుగుతోందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగనన్నను మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరముందని ప్రజలకు సూచించారు. ఆయన వెంట కల్లూరు ఎంపీపీ బోయ శారద, ఎంపీటీసీ మధుసూదనమ్మ, తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, లొద్దిపల్లెలో సర్పంచు పుష్పమ్మ, ఓర్వకల్లు తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

ఓర్వకల్లు: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య ఆరోగ్య కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆస్పత్రికి వస్తున్న రోగులు, అందుతున్న సేవల గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నారా లోకేష్ నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కొడుకు అనిపించుకుని వాస్తవాలు మాట్లాడకుండా చిల్లరగా మాట్లాడటం మంచిది కాదన్నారు. తాను అక్రమాలకు పాల్పడినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. అందుకు దమ్ముంటే మా ఇంటికి విచారణకు వస్తావా? లేదంటే తానే నీ క్యాంప్ ఆఫీస్‌కు రావాలా? అని సవాల్ విసిరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పుట్టిన రోజు వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తన స్వగృహంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. – కర్నూలు(న్యూటౌన్)

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పు కావాలి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవం జరిగేలా చూడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు. శనివారం ఆయన నగర శివారులోని ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తప్పనిసరిగా కాన్పులు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదకర లక్షణాలు కలిగిన గర్భిణులను గుర్తించి వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్‌సీడీ సర్వే వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం పంచలింగాల అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఐరన్ మాత్రల నిల్వల గురించి ఆరా తీశారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు వ్యాధినిరోధక టీకాలు వేయాల్సిన వారి జాబితా రూపొందించి అందరికీ వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఆ తర్వాత నిడ్జూరు గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు.



ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య